సాక్షి ఆదిలాబాద్

గురువారం । 1 । మే । 2025

'నకిలీ'పై ఎస్పీ సీరియస్



జిల్లాలో నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన ఘటనను ఎస్పీ అఖిల్ మహాజన్ సీరియస్‌గా తీసుకున్నారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను విచారణ అధికారిగా నియమించారు.

IIలో ▸



విత్తనపూజకు వేళాయె

జంగుబాయి అమ్మవారి పుణ్యక్షేత్రంలో విత్తన పూజకు ఆదివాసీలు శ్రీకారం చుట్టనున్నారు. నెలరోజులపాటు ఉత్సవాలు కొనసాగనున్నాయి.

IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
42.0/28.0

వాతావరణం

మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహనీయుడు బసవేశ్వరుడు



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్‌రూరల్: సమసమాజ స్థాపనకు కృషి చేసిన బసవేశ్వరుడు మహనీయుడని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లా కేంద్రంలోని బసవేశ్వర చౌక్‌లో బసవేశ్వరుడి జయంతి వేడుకలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆయన బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సమాజంలో కుల, వర్ణ వివక్షను రూపుమాపడం కోసం బసవేశ్వరుడు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి రాజలింగు, జంగమ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి జగదీశ్వర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ యువరాజ్

ఇంద్రవెల్లి: వ్యవసాయ మార్కెట్ యార్డు ద్వారా ఉపాధి పొందుతున్న హమాలీలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. ఇంద్రవెల్లి, నార్నూర్ మార్కెట్ యార్డులకు హమాలీల ఎంపిక ప్రక్రియను స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ హమాలీ తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో డీసీవో బి మోహన్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం, ఏఎంసీ కార్యదర్శి శ్రీనివాస్, పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంకు పురస్కారం



పురస్కారం అందుకున్న టీం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: ఉత్తమ సేవలందించిన జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించింది. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని అబ్కారీభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమలాసన్‌రెడ్డి చేతుల మీదుగా నగదు బహుమతి అందజేశారు. బహుమతి అందుకున్న వారిలో సీఐలు గంగారెడ్డి, అక్బర్ హుస్సేన్, హెడ్ కానిస్టేబుళ్లు ఇంతియాజ్, రవికుమార్, అశ్వక్, సాయిప్రసాద్, కానిస్టేబుళ్లు సిద్ధేశ్వర్, అరవింద్, సందీప్ జమీర్, ఈశ్వర్, సతీష్, మేరి, విజయశ్రీ ఉన్నారు. బృందాన్ని జిల్లా డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ హిమశ్రీ అభినందించారు.

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ఆదిలాబాద్‌టౌన్: వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత సైన్స్ వేసవి శిక్షణ శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 6 వరకు వారం పాటు నిర్వహించనున్న శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం చొరవ చూపాలన్నారు. ఇందులో ఫన్ మాథ్స్, ఫన్ సైన్స్, మిరాకిల్ ఎక్స్‌పోజర్, ఓరిగామి, డ్రాయింగ్, గుడ్ హ్యాండ్ రైటింగ్‌పై తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంజీవ్‌రెడ్డి, డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, ఏఎస్ఓ గోవర్ధన్, మాథ్స్ ఫోరం అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, ఆవుల మహేందర్, రవీందర్, ఊషన్న, శ్రీధర్ బాబు, సంతోష్ కుమార్, ప్రేమ్ కుమార్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరుగు



వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పిప్పర్‌వాడ జెడ్పీఎస్ఎస్ విద్యార్థులు

- ఫలితాల్లో బాలికలదే పైచేయి
- జిల్లాలో 97.40 శాతం ఉత్తీర్ణత
- గతేడాదితో పోల్చితే 4.47 శాతం పెరుగుదల
- రాష్ట్రస్థాయిలో తొమ్మిదో స్థానం
- 65 ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం పాస్

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో 97.40 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. గతేడాది జిల్లా 17వ స్థానంలో నిలవగా, ఈసారి 8 స్థానాలు మెరుగుపర్చుకొని రాష్ట్రస్థాయిలో 9వ స్థానానికి ఎగబాకింది. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సెస్సీ ఫలితాలను బుధవారం విడుదల చేశారు. జిల్లాలో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు ఈ సారి మంచి ఫలితాలు సాధించాయి. 65 పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది ఫలితాలు గ్రేడింగ్‌లో కాకుండా మార్కుల రూపంలో విడుదలయ్యాయి.

మెరుగైన ఫలితాలు..

జిల్లాలో మొత్తం 10,028 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 9,767 మంది ఉత్తీర్ణత సాధించారు. 97.40 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఇందులో బాలురు 5,049 మంది హాజరు కాగా, 4,890 మంది ఉత్తీర్ణులయ్యారు. 96.85 శాతం ఉతీర్ణత నమోదైంది. బాలికలు 4,979 మంది హాజరు కాగా, 4877 మంది పాస్ అయ్యారు. 97.95 ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఉత్తీర్ణత శాతం పరంగా మెరుగుపడగా, రాష్ట్రస్థాయిలో టాప్–10లో నిలిచారు. ఆశ్రమ పాఠశాలల్లో 98.73 శాతం, బీసీ వెల్ఫేర్‌లో 99.69, ప్రభుత్వ యాజమాన్యంలో 87.70, కేజీబీవీల్లో 97.64, మోడల్ స్కూళ్లలో 99.82, ప్రైవేట్ పాఠశాలల్లో 98.76, మినీ రెసిడెన్షియల్‌లో 97.12, సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 100 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్‌లో 99.76, జెడ్పీ యాజమాన్యంలో 96.02 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

సబ్జెక్టుల వారీగా..

జిల్లాలో సబ్జెక్టుల వారీగా ఫలితాలను చూస్తే.. తెలుగులో 99.02 శాతం, సెకండ్ లాంగ్వేజ్‌లో 99.75 శాతం, ఇంగ్లిష్‌లో 99.35 శాతం, గణితంలో 98.87 శాతం, సామాన్య శాస్త్రంలో 98.58 శాతం, సాంఘిక శాస్త్రంలో 99.56 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

జూన్ 3నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ..

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి 13 వరకు జరగనున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు 15 రోజుల గడువు ఉంది. రీకౌంటింగ్, జవాబు పత్రాల జిరాక్స్ కాపీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని, వాటిని డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రీకౌంటింగ్ కోసం సబ్జెక్టుకు రూ.500 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈనెల 16 వరకు గడువు ఉందని సూచించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు..

జిల్లాలో 65 పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ స్కూల్ బంగారుగూడ, పొచ్చర, ప్రభుత్వ పాఠశాల ఖానాపూర్, తాటిగూడ, హిందీ హైస్కూల్, కేజీబీవీ ఆదిలాబాద్‌రూరల్, స్పోర్ట్స్ స్కూల్, మోడల్‌స్కూల్ బజార్‌హత్నూర్, దహెగావ్, పిప్పిరి, కేజీబీవీ బేల, సిర్సన్న, సాంగిడి, కొగ్దూర్, కరంజి, పిప్పల్‌కోటి, భీంపూర్, ప్రభుత్వ పాఠశాల బోథ్, మోడల్ స్కూల్ బోథ్, ధన్నూర్(బి), కౌఠ(బి), మర్లపల్లి, పొచ్చర, కన్నుగుట్ట, బోరిగామ, కేజీబీవీ ఇచ్చోడ, కోకస్‌మన్నూర్, కేజీబీవీ గాదిగూడ, ప్రభుత్వ పాఠశాల గుడిహత్నూర్, కేజీబీవీ తోషం, కొల్హారి, మన్నూర్, కేజీబీవీ ఇంద్రవెల్లి, ముత్నూర్, మోడల్‌స్కూల్ జైనథ్, దీపాయిగూడ, గిమ్మ, కౌట, పెండల్‌వాడ, అడ, పిప్పర్‌వాడ, బాలాపూర్, కూర, సరస్వతినగర్, వాగాపూర్, కేజీబీవీ నార్నూర్, మోడల్‌స్కూల్ నార్నూర్, జెడ్పీఎస్ఎస్ నార్నూర్, తడిహత్నూర్, భీంపూర్, నేరడిగొండ, వాంకిడి, తేజాపూర్, కేజీబీవీ తలమడుగు, బరంపూర్, కుచులాపూర్, తలమడుగు, కజ్జర్ల, లింగి, పల్లి(బి), ఘోట్కురి, కప్పర్ల, తాంసి, పొన్నారి పాఠశాలలు ఇందులో ఉన్నాయి.

మంచి ఫలితాలు సాధించాం



పదో తరగతిలో జిల్లా విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. గతేడాదితో పోల్చితే ఈ సారి దాదాపు ఐదు శాతం ఉత్తీర్ణత పెరిగింది. కలెక్టర్ రాజర్షిషా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చారు. కరదీపికలను అందజేశారు. రాష్ట్రస్థాయిలో జిల్లా 9వ స్థానంలో నిలిచింది. 97.40 శాతం ఉత్తీర్ణత నమోదైంది. వచ్చే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం. – శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో



చిల్కూరి రమ (578)



సట్లవార్ హర్ష్ (575)



హర్షవర్ధన్ (569)



హార్థిక (564)



శైలజ(563)



అమృత(560)



వైశాలి(557)

సర్కారు విద్యార్థుల సత్తా..

పదో తరగతి ఫలితాల్లో ఈ సారి జిల్లా విద్యార్థులు అత్యుత్తమంగా రాణించారు. గతంతో పోల్చితే మెరుగైన ఫలితాలు సాధించడంతో డీఈవో శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు. బంగారిగూడ మోడల్ స్కూల్‌కు చెందిన చిల్కూరి రమ 578 మార్కులు సాధించగా.. సట్లవార్ హర్ష్ 575, హర్షవర్ధన్ 569, కేజీబీవీలో నేరడిగొండకు చెందిన విద్యార్థిని హార్థిక 564, తలమడుగు కేజీబీవీ విద్యార్థిని శైలజ 563, ఆదిలాబాద్‌రూరల్ కేజీబీవీలో వైశాలి 557, సంస్కృతి 556, మయూరి 550, గాదిగూడ కేజీబీవీకి చెందిన విద్యార్థిని లత 552, భోరజ్ మండలం పిప్పర్‌వాడ జెడ్పీ పాఠశాలకు చెందిన వగాడే అమృత 560 మార్కులు సాధించారు.

కలెక్టర్ ప్రశంస

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడంపై కలెక్టర్ రాజర్షిషా హర్షం వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులను ప్రశంసించారు. డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీసీఈబీ సెక్రెటరి కందుల గజేందర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. వచ్చే సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలని, సప్లిమెంటరీ పరీక్షల్లో వారు కూడా ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు.

భూభారతితో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షిషా

ఆదిలాబాద్‌టౌన్: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జైనథ్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి నారాయణ స్వామి ఆలయ ఆవరణలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రెయినీ కలెక్టర్ సలోని చాబ్రాతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సు ప్రారంభించారు. చట్టం విధివిధానాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ప్రత్యేక కౌంటర్ల ద్వారా రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం తెచ్చిన భూ భారతి చట్టం ద్వారా రైతులకు న్యాయం జరుగనుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వినోద్‌కుమార్, జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్దన్ రెడ్డి, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

బేల: భూభారతి చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎమ్మెల్యే శంకర్, ఆర్డీవో వినోద్‌కుమార్, జైనథ్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ విలాస్, మండల ప్రత్యేకాధికారి మనోహర్‌రావు, తహసీల్దార్ రఘునాథ్‌రావు, డీటీవామన్‌రావు, ఎంపీడీవో మహేందర్‌కుమార్, ఏవో సాయితేజరెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 'ఎర్లీబర్డ్' గడువు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో ముందస్తు ఆస్తి పన్ను వసూలు కోసం ప్రభుత్వం అమలు చేసిన ఎర్లీబర్డ్ స్కీం గడువు బుధవారంతో ముగిసింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నులను ముందస్తుగా చెల్లించిన వారికి ఈ స్కీం కింద ప్రభుత్వం ఐదు శాతం రాయితీ కల్పించింది. పన్ను చెల్లింపునకు చివరి రోజు కావడంతో బల్దియా యంత్రాంగం, బిల్ కలెక్టర్లు మండుటెండ సైతం లెక్క చేయకుండా తమకు కేటాయించిన కాలనీల్లో విస్తృతంగా తిరిగారు. ఇంటింటికి వెళ్లి పన్ను చెల్లించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అయితే ఈనెల వ్యవధిలో ఎంత పన్ను వసూలైంది ఇంకా లెక్కతేలలేదు. గతేడాదితో పోల్చితే అధికంగా ఉంటుందా.. వెనకబడ్డారా అనేది గురువారం వెల్లడయ్యే అవకాశముంది.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు మళ్లీ పొడిగింపు

- ఈ నెల 3వరకు అవకాశం
- ఈ సారైనా స్పందించేనా?



ఫీజు చెల్లించేందుకు వచ్చిన దరఖాస్తుదారులు

కైలాస్‌నగర్: అక్రమ లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎల్‌ఆర్‌ఎస్–2020 స్కీం కింద ఫీజు చెల్లించే గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. 25శాతం రాయితీతో కూడిన ఫీజు చెల్లింపు గడువు బుధవారంతో ముగియగా దాన్ని మే 3వరకు పొడిగిస్తూ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి టి కే. శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రభుత్వం ఇప్పటికే నెల గడువు పొడిగించగా జిల్లాలో ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. ఫీజు చెల్లింపులో సాంకేతిక సమస్యలు తలెత్తడం, పలు ప్లాట్లను నిషేధిత భూముల జాబితాలో చూపడం, వాటిని సరిదిద్దాల్సిన సంబంధిత అధికారుల మధ్య సమన్వయం కొరవడడం వంటి కారణాలతోనే ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఎల్‌ఆర్‌ఎస్ కోసం వేల సంఖ్యలో దరఖాస్తులు అందినప్పటికీ ఫీజు చెల్లించేందుకు మాత్రం చాలా మంది ముందుకు రాలేదు. సర్కారు ఖజానాకు భారీగా ఆదాయం చేకూరుతుందని భావించినప్పటికీ నిరాశే ఎదురైంది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో రుసుం రూపేణ రూ.7.60 కోట్ల ఆదాయం సమకూరింది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ఎంత ఆదాయం వచ్చింది, ఎన్ని దరఖాస్తులకు ఫీజు చెల్లించారనే వివరాలు పంచాయతీ అధికారుల వద్ద అందుబాటులో లేకపోవడం చూస్తుంటే ఈ ప్రక్రియపై వారు ఎంత చిత్తశుద్ధి కనబరుస్తున్నారనేది స్పష్టమవుతోంది. దరఖాస్తుల సంఖ్య పరంగా చూస్తే ఆదిలాబాద్ మున్సిపల్‌తో పాటు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి. కాగా మరో మూడు రోజులు అవకాశం కల్పించడంతో దరఖాస్తుదారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

జిల్లాలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు, రుసుం చెల్లింపు వివరాలిలా..

ప్రాంతం	అందిన దరఖాస్తులు	రుసుం చెల్లింపునకు అర్హులు	ఇప్పటి వరకు ఫీజు చెల్లించిన వారు
మున్సిపల్	22,489	17,854	4,216
గ్రామీణ	6,057	4,100	1,220 (రెండు రోజుల క్రితం వరకు)



'నన్ను ప్రేమతో, ఆప్యాయతతో స్వాగతించినందుకు కృతజ్ఞతలు.. చాలా సంవత్సరాల తర్వాత నేను ఇక్కడికి రావడం జరిగింది. అప్పటికి.. ఇప్పటికీ చాలా మార్పు చోటు చేసుకుంది. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న జిల్లా ఇది.. అప్పటి రాజకీయ నాయకులు ఇప్పటికీ క్రియాశీలకంగా ఉన్నారు..' ఈ మాటలన్నది కొత్త సీఎస్ కె.రామకృష్ణారావు. ఏప్రిల్ 18న భూభారతి అవగాహన సదస్సు కోసం రాష్ట్ర మంత్రులు జిల్లాలోని భోరజ్ మండలం పూసాయి గ్రామానికి వచ్చినప్పుడు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి హోదాలో రామకృష్ణారావు కూడా విచ్చేశారు. ఈ సందర్భంగా వేదిక పైనుంచి ఆయన జిల్లాతో అనుబంధాన్ని పంచుకున్నారిలా.

– సాక్షి,ఆదిలాబాద్

మన పాత కలెక్టరే.. కొత్త సీఎస్



అప్పట్లో తలమడుగు మండలంలో ఓ వేదిక పైనుంచి ప్రసంగిస్తున్న కె.రామకృష్ణారావు

- ఉమ్మడి జిల్లాతో రామకృష్ణారావుకు అనుబంధం
- 23 ఏళ్ల క్రితం ఇక్కడే విధులు
- ఇటీవల 'భూ భారతి' సదస్సుకు హాజరు

కొత్త సీఎస్‌గా నియమితులైన కె.రామకృష్ణారావుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో అనుబంధం ఉంది. ఆయన 2000 సంవత్సరం జూలై 7 నుంచి 2002 అక్టోబర్ 25 వరకు ఉమ్మడి ఆదిలాబాద్ కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. రెండేళ్లకు పైగా జిల్లాలో విధులు నిర్వహించిన ఆయన ఈ ప్రాంతవాసులతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. అప్పట్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 52 మండలాలు ఉండగా, ఆయన విస్తృతంగా పర్యటించి ప్రజలతో మమేకమయ్యే వారు. దీంతోనే ఆయన ఇక్కడినుంచి వెళ్లిపోయి ఏళ్లు దాటినా ప్రజలు ఇప్పటివరకు గుర్తుంచుకున్నారంటే ఆ అనుబంధమే కారణం.

అభివృద్ధికి తోడ్పాటు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అనేక అభివృద్ధి పనులకు ఆయన తోడ్పాటునందించారు. ప్రధానంగా అప్పట్లో జిల్లా కేంద్రానికి తొలిసారి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసింది రామకృష్ణారావు హయాంలోనే. అప్పట్లో జిల్లా మీదుగా విస్తరించి ఉన్న జాతీయ రహదారి నం.7 ఒక వరుస రహదారిగా ఉండేది. ఆ సమయంలో నిర్మల్ జిల్లా వద్ద వేకువజామున ఓ భారీ ప్రమాదంలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే జిల్లా కేంద్రం నుంచి సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుల సహాయార్థం ఆయన తీసుకున్న చొరవ ఇప్పటికీ జనం గుర్తు చేసుకుంటారు. అలాగే జిల్లాలో వరదలు పోటెత్తిన సమయంలో కారు వెళ్లలేని గ్రామాల్లో ఆయన ద్విచక్ర వాహనంపై వెళ్లి వరద బాధితుల సహాయార్థం చర్యలు తీసుకున్నారు. ఈవిధంగా రామకృష్ణారావు జిల్లాపై చెరగని ముద్ర వేశారు. ఆయన కొత్త సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో ఇప్పటికే పలువురు ముఖ్య నేతలు ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి వస్తున్నారు.

'ఇందిరమ్మ'కు ఉచిత ఇసుక



బేల మండలం కాంగర్‌పూర్‌లో ఇసుక నిల్వలు

- ప్రభుత్వ అవసరాలకు సైతం..
- పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో పది రీచ్‌ల గుర్తింపు
- తహసీల్దార్ల పర్యవేక్షణలో సరఫరా ప్రక్రియ

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్లతో పాటు ప్రభుత్వపరంగా చేపట్టే నిర్మాణాలకు ఉచితంగా ఇసుక అందించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించింది. పెన్‌గంగలో ఇసుక లభ్యతపై ఇటీవల సంయుక్త పరిశీలన చేపట్టిన మైనింగ్, ఇరిగేషన్, గ్రౌండ్‌వాటర్, రెవెన్యూ శాఖల అధికారులు జైనథ్, భీంపూర్, తాంసి, బేల మండలాల్లోని నది పరీవాహక ప్రాంతాల్లోని పది ఇసుక రీచ్‌లను గుర్తించారు. వాల్టా చట్టం అనుసరించి ఇసుక వెలికితీయాలని నిర్ణయించారు. తహసీల్దార్ల పర్యవేక్షణలో సరఫరా ప్రక్రియ చేపట్టనున్నారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఇసుక రీచ్‌లు ఇవే..

ఉచితంగా ఇసుక అందించేందు కోసం పెన్‌గంగలో మొత్తం పది ఇసుక రీచ్‌లను ఎంపిక చేశారు. భీంపూర్ మండలం అంతర్గాంలో ఇసుక మందం 1.5 మీటర్లుగా గుర్తించిన అధికారులు గుబిడి, వడూర్, తాంసి-కే గ్రామాల్లో, అలాగే జైనథ్ మండలంలోని సాంగ్వి-కే, ఆనంద్‌పూర్, భోరజ్ మండలంలో డోల్లరా, పెండల్వాడలో 0.5 మీటర్లుగా, బేల మండలంలో మణియార్‌పూర్, సాంగిడి గ్రామాల్లో 1.5 మీటర్లుగా ఉన్నట్లు గుర్తించారు. ఆయా గ్రామాల్లో నుంచి ఇసుకను ఉచితంగా సరఫరా చేయనున్నారు.

సరఫరా ప్రక్రియ ఇలా...

ఆయా మండలాల తహసీల్దార్ల ఆధ్వర్యంలో ఉచిత ఇసుక సరఫరా చేపట్టనున్నారు. ఇసుక అవసరమున్న ఇందిరమ్మ లబ్ధిదారులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు చేపట్టే కాంట్రాక్టర్లు ముందుగా సంబంధిత తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకోవాలి. వారికి ప్రాధాన్యత క్రమంలో తహసీల్దార్లు వే బిల్లులు జారీ చేస్తారు. వాటిఆధారంగా నిర్దేశించిన సమయాల్లో ఇసుకను తీసుకెళ్లాల్సి ఉంటుంది. అయితే ఆయా వాహనాల డ్రైవర్లకు లైసెన్స్‌తో పాటు వాహనానికి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఇసుకను ఎక్కడికి తీసుకెళ్తున్నారనేది తహసీల్దార్లకు తప్పనిసరిగా సమాచారమందించాలి. ఎక్కడ డంప్ చేశారనేది వారు స్వయంగా పరిశీలిస్తారు. నిబంధనలకు విరుద్ధంగా డంప్‌చేసినా, నిర్దేశిత పనులకు కాకుండా ఇతర వాటికి తరలించినా చట్టప్రకారం ఆ డంప్‌లను సీజ్ చేయడంతో పాటు బాధ్యులపై చర్యలుంటాయని ఆర్డీవో వినోద్‌కుమార్ తెలిపారు. ఇసుక అవసరమున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

మతిస్థిమితం లేక యువకుడి ఆత్మహత్య

కుభీర్: మండలంలోని హంపోలి గ్రామానికి చెందిన శెరె శ్రీకాంత్ (35) మతిస్థిమితం లేక ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పి.రవీందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీకాంత్ గత కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతుండే వాడు. ఈక్రమంలో బుధవారం ఉదయం సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి సోదరుడు దిలీప్ ఫిర్యాదుతోకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడికి యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు

తానూరు: లైంగికదాడికి యత్నించిన కేసులో వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ భైంసా మేజిస్ట్రేట్ దేవేందర్‌బాబు బుధవారం తీర్పునిచ్చారు. ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి కథనం ప్రకారం..మండంలలోని వడ్గాం గ్రామానికి చెందిన దిలీప్ 2020 జనవరి 26న అదేగ్రామానికి చెందిన మహిళ ఇంటికి వెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాధిత మహిళ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజన్న కేసు దర్యాప్తు చేశారు. కోర్టులో నిందితుడు నేరం రుజువు చేయడంతో మేజిస్ట్రేట్ ఈమేరకు తీర్పునిచ్చారని ట్రెయినీ ఎస్సై వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా (బి)సమీపంలో ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు, 108 పైలెట్ ఆత్రం ఆశోక్, కృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన యువకుడు జున్నైద్ బైక్‌పై గుడిహత్నూర్ వైపు వెళ్తున్నాడు. దనోరా(బి) సమీపంలో పిట్స్ రావడంతో ఎదురుగా కాలినడకన వస్తున్న గ్రామానికి చెందిన శివరాజ్‌పాటిల్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శివరాజ్ పాటిల్‌తోపాటు జున్నైద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.

గాదిగూడ తహసీల్దార్ బదిలీ.. ఉద్యోగ విరమణ

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ తహసీల్దార్ ఎస్.విజయానందం మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీసీఎల్ ఏ కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆయన సొంత జిల్లాలో రిపోర్ట్ చేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందారు. కాగా, విజయానందం స్థానంలో డీటీగా పనిచేస్తున్న చౌహాన్ విలాస్‌కు తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీ చేశారు.

విత్తనపూజకు వేళాయె

- జంగుబాయి సన్నిధిలో ఆదివాసీల పూజలు
- ఆలయంలో రేపటి నుంచి నెలరోజులు ఉత్సవాలు



జంగుబాయి కొలువైంది ఇదే గుహలో



ఆలయంలో కొలువైన పోచమ్మ తల్లులు

కెరమెరి(ఆసిఫాబాద్): అనాదిగా వస్తున్న ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడంలో ఆదివాసీలు ముందుంటున్నారు. జూన్ 8న మృగశిరకార్తె ప్రవేశించనుండడంతో ఆదివాసీలు తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులోని మహరాజ్‌గూడ అడవుల్లో కొలువైన జంగుబాయికి పుణ్యక్షేత్రంలో విత్తన పూజకు శ్రీకారం చుట్టారు. అక్కడి గుహలోకి వెళ్లి దీపం వద్ద పూజలు చేస్తారు. రావుడ్, పోచమ్మ, మైసమ్మకు విత్తనాలు చూపించి మొక్కి అమ్మవార్లకు నైవేద్యం చూపిస్తారు. విత్తన పూజల అనంతరం తమ పొలాల్లో విత్తనాలు నాటడం ప్రారంభిస్తారు. దీన్ని గోండి భాషలో 'మొహతుక్'అంటారు. అదేవిధంగా గిరి గ్రామాల్లో ఏటా జరిగే విత్తన పూజల ముందుగా జంగుబాయి అమ్మవారికి విత్తనాలు చూపెట్టాక పొలాల్లో నాటడంతో అధిక దిగుబడి వస్తాయని భక్తుల నమ్మకం.

నేడు దీపోత్సవం

జంగుబాయి సన్నిధిలో గురువారం దీపోత్సవం, శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలు నెల రోజుల పాటు నిర్వహిస్తారు. వివిధ గ్రామాలకు చెందిన మోకాలు తరలివచ్చి పూజలు చేస్తాయి. దుక్కిలతో దున్ని విత్తనాలు వేసేందుకు తమ పొలాలను రైతులు సిద్ధం చేశారు. ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాలోనే ఆదివాసీలు అధికంగా ఉన్నారు.

దేవతలకు విత్తనాలు చూపిస్తారు

మే మాసంలో అన్ని గ్రామాల్లో గ్రామ పటేల్ ఇంట్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారు. ఆదివాసీల కులదైవమైన పాటేరు అమ్మోరు, జంగుబాయి, గాంధారి కిల్ల, పద్మాల్‌పురి కాకో వద్దకు వెళ్లి విత్తనాలను చూపిస్తారు. అక్కడే దేవతల ఆశీర్వాదం తీసుకుని తిరుగుపయనమవుతారు. అనంతరం



రాహుడ్ దేవతలు

గ్రామంలో ఉన్న ఆకిపేన్, అమ్మోరు, పోచమ్మ వద్దకు వెళ్లి విత్తనాలతో పూజలు చేస్తారు. అదే రోజు రాత్రి 2.5 కిలోల జొన్నలతో గట్క తయారు చేసి ఆరగిస్తారు. అర్ధరాత్రి అడవికి వెళ్లి (కుమ్మడ్) చెట్టు ఆకులను తీసుకువచ్చి డొప్పలు తయారు చేసి ఇళ్లల్లో ఇస్తారు. అందులో పూజ చేసిన విత్తనాలు వేస్తారు. ఈ కార్యక్రమంతా మృగశిర మాసానికి కొద్ది రోజుల ముందుగా నిర్వహిస్తారు.

విత్తన పూజలు(మొహతుక్)

విత్తన పూజ చేయాలన్న రోజు రైతు కుటుంబమంతా ఉదయాన్నే పొలం బాట పడుతారు. ఉదయం ఇంటిని శుభ్రం చేసి పేడతో అలుకు చల్లుతారు. పొలానికి వెళ్లాక జొన్నతో గట్కా తయారు చేసి కుల దైవంతోపాటు నేల తల్లికి సమర్పిస్తారు. అనంతరం పొలంలో విత్తనాలు చల్లి అరకకు ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటుతారు. గ్రామ పటేల్ ఇంటి ఎదుట మహిళలు సంప్రదాయ నృత్యాలు చేస్తారు. పురుషులు గిల్లిదండా ఆట ఆడుతారు. తర్వాత సహపంక్తి భోజనం చేస్తారు.

చంచి భీమల్ దేవుడి కల్యాణంతో..

ఆదివాసీల ఇష్టదైవమైన చంచి భీమల్ దేవుడి కల్యాణం సందర్భంగా ఏటా ఏప్రిల్, మే మాసంలో విత్తనాలను దేవుడికి చూపిస్తారు. ఆరోజు ఆదివాసీలు భీమల్ దేవుడికి సంప్రదాయ పూజలు చేస్తారు. అడవుల్లో లభించే ఆకులతో ఆరు డొప్పలను తయారు చేస్తారు. అందులో అన్ని విత్తనాలను కలిపి భీమల్ దేవునికి చూపిస్తారు. అనంతరం వాటిని ఇళ్లకు తీసుకెళ్లి దాచి పెడ్తారు. ఆరోజు పిండి వంటలు చేసి ఆరగిస్తారు. మృగశిర కార్తె ప్రారంభంతో ఆ విత్తనాలను తమ పొలాల్లో చల్లుతారని పలువురు చెబుతున్నారు.

దేవతలకు చూపించాకే..



పొలాల్లో విత్తనాలు నాటే కొన్నిరోజుల ముందు కుల దేవతలకు వాటిని చూపిస్తాం. ప్రత్యేక పూజలు చేశాకే పొలానికి వెళ్లి జొన్నగట్కాను వండి ఆరగిస్తాం. నేలతల్లికి ప్రత్యేక పూజలు చేసి విత్తనాలు నాటడం ప్రారంభిస్తాం. – సలాం శ్యాంరావు, జంగుబాయి ఉత్సవ కమిటీ చైర్మన్

ఆచారాలు పాటిస్తున్నాం



ఆదివాసీలు ఆచారాలు, సంప్రదాయాలు పాటిస్తూ వస్తున్నారు. ఏళ్ల క్రితం నుంచి ప్రారంభమైన విత్తన(మొహతుక్) పూజలు ఇప్పుడు కూడా చేస్తున్నాం. పూజలు చేయందే విత్తనాలు నాటం.– పుర్క బాపూరావు, జంగుబాయి ఉత్సవ కమిటీ, ప్రచార కార్యదర్శి

ఉమెన్స్ హ్యాండ్‌బాల్ విజేత ఉమ్మడి ఆదిలాబాద్



కప్ అందుకుంటున్న ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

- రన్నరప్‌గా రంగారెడ్డి జట్టు

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో మూడు రోజులు జరిగిన రాష్ట్రస్థాయి 54వ సీనియర్ మహిళల తెలంగాణ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు విజేతగా, రంగారెడ్డి జట్టు రన్నరప్‌గా నిలిచింది. బుధవారం ఫైనల్‌మ్యాచ్‌లో ఈ జట్లు తలపడగా ఆదిలాబాద్‌జట్టు 13, రంగారెడ్డి జిల్లా జట్టు 11 గోల్స్ వేసింది. మూడో స్థానంలో వరంగల్, నాలుగో స్థానంలో ఖమ్మం జట్లు నిలిచాయని, గెలిచిన జట్లకు నిర్వాహకులు షీల్డ్‌లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కనపర్తి రమేశ్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జట్టు కోసం 20 మందిని ఎంపిక చేసి వరంగల్‌లో కోచింగ్ ఇస్తామన్నారు. గుజరాత్‌లోని బూజ్‌లో ఈనెల 21 నుంచి 27 వరకు నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొంటుందన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ ఉమ్మడి 10 రాష్ట్రాల నుంచి 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి పవన్‌కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజర్ కాంపెల్లి సమ్మయ్య, కోశాధికారి రమేశ్‌రెడ్డి, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు జొన్న పంట దగ్ధం

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ గ్రామంలో బుధవారం ప్రమాదవశాత్తు దాదాపు 10 ఎకరాల జొన్న పంట దగ్ధమైంది. ఎంఆర్‌ఐ నూర్‌సింగ్ కథనం ప్రకారం.. గ్రామంలో మధ్యాహ్నం కొత్త కొండ లక్ష్మీ పంటచేనులో జొన్నపంటకు మంటలు అంటుకున్నాయి. కొన్ని క్షణాల్లో చుట్టుపక్కల చేలకు మంటలు విస్తరించి దాదాపు 10 ఎకరాల జొన్న పంటతోపాటు 100 పైపులు, స్ప్రింక్లర్లు కాలిబూడిదయ్యాయి. ఘటన స్థలాన్ని సీఐ వెంకటేశ్వర్‌రావు, ఆడె గజేందర్, జల్కే పాండురంగ్, నారాయణ పరిశీలించారు.ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తాంసిలో రెండెకరాలు..

తాంసి: మండల కేంద్రంలో బుధవారం మధ్యాహ్నం నిప్పంటుకుని రెండెకరాల్లో జొన్న పంట దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి..సోమ గంగారెడ్డి పంటచేను పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన



బజార్‌హత్నూర్: దేగామలో కాలిబూడిదైన జొన్న

నిప్పురవ్వలతో మంటలు వ్యాప్తి చెందాయి. దీంతో రెండెకరాల్లో జొన్న పంట దగ్ధమైంది. స్థానికులు నీళ్లను చల్లి మంటలార్పివేశారు. అగ్ని ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లింది. గ్రామానికి చెందిన మరో రైతు సతీశ్ చేనులో అకస్మాత్తుగా మంటలు వ్యాప్తి చెంది పదికి పైగా స్ప్రింక్లర్ల పైపులు దగ్ధమయ్యాయి.

గుండెపోటుతో ట్రెయినీ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ మృతి



రామళ్ల సాగర్ (ఫైల్)

భీమారం: మండల కేంద్రానికి చెందిన రామళ్ల సాగర్ ట్రెయినీ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ గుండెపోటుతో మృతిచెందాడు. అతని బంధువులు తెలిపిన వివరాలు.. కొన్నినెలల క్రితం సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికైన సాగర్ (29) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురంలో శిక్షణ పొందుతున్నాడు. శిక్షణలో భాగంగా కాలికి దెబ్బతగలంతో వైద్యులు విశ్రాంతి తీసుకోవాలనడంతో గతనెల 26న స్వగ్రామానికి వచ్చాడు. బంధువుల వివాహం ఉండటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలసి బుధవారం మంచిర్యాలకు వెళ్లాడు. అక్కడ ఒక హోటల్ వద్ద కూర్చున్న సాగర్ అకస్మాత్తుగా కింద పడిపోయాడు. వెంటనే గమనించి అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. సాగర్ మృతితో భీమారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

ఆదిలాబాద్‌రూరల్: ట్రాక్టర్ బోల్తా పడి ఒకరు మృతి చెందినట్లు ఏఎస్సై మారుతి రాథోడ్ తెలిపారు. అయన కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని సిరికొండ గ్రామానికి చెందిన సిడాం నాగోరావు (42) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇసుక లోడ్ తీసుకొని గుండంలొద్ది గ్రామానికి వెళ్లాడు. అన్‌లోడింగ్ చేసి తిరుగుపయనమయ్యాడు. బుధవారం వేకువజామున మార్గమధ్యలో ట్రాక్టర్ బోల్తాపడి గుంతలో పడిపోయింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతన్ని 108లో రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఏఎస్సై వివరించారు.

మంచిర్యాల సీఈగా సత్య రాజచంద్ర

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇరిగేషన్ శాఖలో ఇద్దరు అధికారులకు ఇన్‌చార్జీలుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉద్యోగ విరమణ చేసి వివిధ పోస్టుల్లో పనిచేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన విషయం తెలిసిందే. ఖాళీగా ఉన్న స్థానాల్లో ఇన్‌చార్జీలకు బాధ్యతలు అప్పగించారు. పెద్దపల్లి జిల్లా ఎస్‌ఈగా పనిచేస్తున్న ఎ.సత్య రాజచంద్రను మంచిర్యాల చీఫ్ ఇంజినీర్‌గా నియమించారు. ఆదిలాబాద్ ఇరిగేషన్ సర్కిల్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.లక్ష్మిని నిర్మల్ సర్కిల్ డీఈగా బాధ్యతలు అప్పగించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ఇరిగేషన్ శాఖ ప్రభుత్వ ప్రి న్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ పేర్కొన్నారు.

ఒకరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: చంపేస్తానని బెదిరింపులకు గురిచేసిన ఓ వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల క్రితం రాంనగర్ కాలనీకి చెందిన ఖాలీం ఖాన్, అన్వర్‌ల మధ్య గొడవ జరిగింది. దీంతో ఖాలీంఖాన్‌పై గతంలో కేసు నమోదైంది. తనకు రూ.50వేల వరకు ఖర్చయిందని కేసు వెనక్కి తీసుకుంటాను. కానీ ఆ రూ.50వేలు ఇవ్వాలని ఖాలీంఖాన్‌ను అన్వర్ డిమాండ్ చేశాడు. లేకపోతే చంపేస్తానని బెదిరింపులకు గురిచేయడంతో అన్వర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వడ్డీ వ్యాపారిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన వడ్డీ వ్యాపారి బలవంత్‌రావుపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో తనిఖీలు చేపట్టగా డబ్బులు అప్పుగా ఇచ్చి ఆటోను తాకట్టు పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ప్రామిసరీ నోట్లు లభించినట్లు తెలిపారు. ఆయనకు నోటీసు జారీ చేసినట్లు వివరించారు.

వడ్డీ వ్యాపారం చేస్తున్న మహిళపై..

ఆదిలాబాద్‌రూరల్: వడ్డీ వ్యాపారం చేస్తున్న ఓ మహిళపై బుధవారం కేసు నమోదు చేసినట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని పిట్టల్‌వాడకు చెందిన దుర్పత బాయి వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో వారి ఇంటి వద్ద దాడి చేయగా ఆమె ఇంట్లో వడ్డీ వ్యాపారానికి సంబంధించిన నలుగు పుస్తకాలు లభ్యమయ్యాయి. దీంతో ఆమెపై మనీలాండరింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు మట్కా నిర్వాహకులపై..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన ఇద్దరు మట్కా నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం అన్నదమ్ముళ్లు వసీమ్, నదీమ్‌లు బైక్‌పై తిరుగుతూ మట్కా నిర్వహిస్తున్నారు. బొక్కల్‌గూడ సమీపంలో పోలీసులు వాహనాలు తనిఖీ చేయగా, ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

తాత్విక ధోరణితో సమున్నత జీవితం

- 'జీవితమే ఒకపుస్తకం' గ్రంథ పరిచయ కార్యక్రమంలో సాహితీవేత్తలు
- జిడ్డు కృష్ణమూర్తి ఆంగ్ల పుస్తకాన్ని అనువదించిన జిల్లా కవి



ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

నిర్మల్‌ఖిల్లా: తాత్విక ధోరణి ద్వారానే సమున్నత జీవితం సిద్ధిస్తుందని జిల్లాకు చెందిన పలువురు సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. జిల్లాకేంద్రంలోని కావేరి ఫౌండేషన్ గ్రంథాలయంలో మంగళవారం రాత్రి 'జీవితమే ఒక పుస్తకం'గ్రంథ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, అనువాదకర్త కె.మచ్చేందర్..ప్రపంచ తాత్వికవేత్త జిడ్డు కృష్ణమూర్తి ప్రసంగాల సమాహార గ్రంథం 'ది బుక్ ఆఫ్ లైఫ్'అనే ఆంగ్ల పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. కార్యక్రమంలో పాల్గొన్న సాహితీవేత్తలు మాట్లాడుతూ రెండున్నరేళ్ల పాటు కష్టపడి ఈ గ్రంథాన్ని తెలుగులోకి అనువదించడం ప్రశంసనీయమని కొనియాడారు. కావేరి ఫౌండేషన్ చైర్మన్ అప్పాల చక్రధారి, సాహితీవేత్తలు టి.సంపత్‌కుమార్, నరసయ్య, రవీంద్రబాబు, తుమ్మల దేవరావు, కృష్ణంరాజు, మునిమడుగుల రాజారావు, ఆకుల సుదర్శన్, అంబటి నారాయణ, అనిత, నాగరంజని, నూకల విజయ్‌కుమార్, దీపక్, పోలీస్ భీమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి చరిత్ర కాలగర్భంలోకి..



దేవతమూర్తుల విగ్రహాలు



నాటి రాతి స్తంభాలు

కడెం:మండలంలోని బెల్లాల్ సమీపంలో గోదావరి, కడెం నది కలిసే ప్రాంతంలో 1200 ఏళ్ల క్రితం నాటి మల్లికార్జున స్వామి ఆలయ చరిత్ర కాలగర్భంలోకి కలిసిపోతుంది. ఆలయ గర్భంలో నిధులు, నిక్షేపాలు ఉన్నాయని వందల ఏళ్ల క్రితం ఆలయాన్ని, దేవతమూర్తుల విగ్రహాలను నాడు కొందరు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో స్తంభాలు పడి ఓ వ్యక్తి మృతిచెందినట్లు పెద్దలు చెబుతున్నా రు. పురాతన ఆలయాన్ని పరిరక్షించకపోవడంతో అనాటి చరిత్రాక ఆనవాళ్లు కనుమరుగవుతున్నాయి. విగ్రహాల తల భాగాలు లేకుండా పోగా, రాతిస్తంభాలు గోదావరి ఒడ్డున కుప్పలుగా ఉన్నా యి. ప్రస్తుతం పురాతన ఆలయం ఉన్నచోట గ్రా మానికి చెందిన వారు నూతన ఆలయ నిర్మాణం చేపడుతున్నారు. 1200 ఏళ్ల క్రితం నాటి చరిత్రని, శివ సాహిత్యం పొందడానికి ఆత్మహుతి చేసుకున్న వీరగల్లు విగ్రహంగా భావిస్తున్నట్లు తెలంగాణ చరిత్రబృందం కన్వీనర్ హరగోపాల్, రాజ్‌కుమార్ తెలిపారు.

నకిలీపత్రాల ఘటనపై ఎస్పీ సీరియస్

- ఉద్యోగాలు పొందిన 17 మంది..
- విచారణ అధికారిగా ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్
- కొనసాగుతున్న విచారణ

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి ఏకంగా 17 మంది ఉద్యోగాలు సాధించిన సంఘటన జిల్లాలో కలకలం రేపుతోంది. బీఎస్ఎఫ్‌లో 7, ఐటీబీపీలో 7, ఎస్ఎస్‌బీలో 1, సీఆర్పీఎఫ్‌లో 2 ఇద్దరు ఉన్నట్లు తెలుస్తోంది. బీఎస్ఎఫ్‌లో ఉద్యోగాలు సాధించిన ముగ్గురిపై ఇచ్చోడ, ఇంద్రవెల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదైన విషయం విధితమే. మరో 14 మంది నకిలీ పత్రాలతో ఉద్యోగాల్లో కొనసాగుతుండటంతో ఎస్పీ అఖిల్ మహాజన్ ఈఘటనను సీరియస్‌గా తీసుకున్నారు. ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్‌ను విచారణ అధికారిగా నియమించారు. ఆమె నేతృత్వంలో ఇప్పటికే పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రెండు రోజుల నుంచి మీ సేవ కేంద్రాలను తనిఖీలు చేసి నిర్వాహకులను విచారించారు. గత ఐదునెలల వ్యవధిలో ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ నుంచి నివాస ధృవీకరణ పత్రాల కోసం 180 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం. ఇతర రాష్ట్రాల యువకుల దరఖాస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రిజెక్ట్ చేసిన తిరిగి ఒక్కక్కరు రెండు, మూడుసార్లు దరఖాస్తులు చేసుకోవడం వెనుక దాగి ఉన్న అసలు రహస్యం అంతుపట్టడం లేదు. ఏది ఏమైన నివాస ధ్రువీకరణ పత్రాలను మార్ఫింగ్ చేసి భద్రత దళాల్లో ఉద్యోగం పొందడంపై జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. స్థానికంగా ఉండేవారి ఆధార్, రేషన్‌కార్డు పత్రాలతో దరఖాస్తు చేయడం, ఈ దిశగా పోలీసుల విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.

డీఎంహెచ్‌వోకు బెదిరింపు కాల్

- ఏసీబీ అధికారి అంటూ..
- ఆస్పత్రులను తనిఖీ చేస్తుండగా ఫోన్

ఆదిలాబాద్‌టౌన్: డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌కు మంగళవారం బెదిరింపు కాల్ వచ్చింది. జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రులను తనిఖీ చేస్తుండగా హైదరాబాద్ ఏసీబీ ఆఫీస్ నరేందర్ కుమార్ రెడ్డి నుంచి ఫోన్ వచ్చింది. డీఎంహెచ్‌వో తొడసం చందు మాట్లాడుతున్నారా అని అడగగా, కాదు.. తాను డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అని చెప్పారు. జిల్లాలో ఎన్నేళ్ల నుంచి పనిచేస్తున్నారని అడుగగా, 20 ఏళ్ల నుంచి వైద్యసేవలు అందిస్తుండగా, నాలుగేళ్ల నుంచి డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, డీఎంహెచ్‌వోపై ఏసీబీ రైడ్ అవుతుందని పేర్కొనగా, తాను ఎవరికి భయపడనని, ఏసీబీ రైడ్ చేసుకొమ్మని తెలిపారు. ఈ విషయమై డీఎంహెచ్‌వో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయమై ఏసీబీ డీఎస్పీ డీఎంహెచ్‌ఓను ఆరా తీశారు. ఏసీబీ అధికారులు ఎవరూ ఫోన్ చేసి వివరాలు అడగరని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు




అభినందిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. బుధవారం ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా తన క్యాంపు కార్యాలయంలో డీడీ అంబాజీ, ఏసీఎంవో జగన్‌ను అభినందించారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసారి 96 శాతం ఫలితాలు సాధించినట్లు ఏసీఎంవో జగన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 108 పాఠశాలలు, అందులో 65 పాఠశాలలు వంద శాతం వచ్చాయని పేర్కొన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పదిలో ఉత్తమ ఫలితాలు సాధనకు ఐటీడీఏ పీవో సారథ్యంలో చేపట్టిన మిషన్ లక్ష్యం ఎంతో మేలు చేసిందన్నారు. వచ్చే ఏడాదిలో పదిలో వందశాతం ఫలితాలు సాధించేలా కృషిచేయాలని ఐటీడీఏ పీవో పేర్కొన్నారు.

మూడు కిలోమీటర్లు వెళ్తేనే నీరు



ఇంద్రవెల్లి మండలంలోని తేజాపూర్ పంచాయతీ పరిధిలోని సాలేగూడలో నీటి కోసం గ్రామస్తులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు. గ్రామశివారులో వ్యవసాయ బోరు బావుల నుంచి, ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం బోరుబావులు అడుగంటడంతో నీళ్లు రావడం లేదు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. గ్రామానికి 3 కి.మీ దూరంలో సిరికొండ మండలం రాంపూర్‌కు బైక్‌లు, ఎడ్లబండ్లపై నీటిని తెచ్చుకుంటున్నారు. కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి గ్రామంలో నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. – ఇంద్రవెల్లి



నిర్వహణ: నిర్మలా రెడ్డి

సమ్మర్ | సమతుల్యత

వయసుల వారీగా డైట్ చక్ర

టీనేజ్, యవ్వనం, గర్భధారణ, పిల్లలకు పాలు ఇవ్వడం, మెనోపాజ్, వయసు పైబడటం.. వంటి దశల ఆధారంగా పోషక అవసరాలు మారుతుంటాయి. కానీ, మన ఇళ్లలో సాధారణంగా అందరికీ ఒకేతరహా వంటను వండుతుంటాం. దీనివల్ల వయసుల వారీగా సరైన పోషకాలు శరీరానికి అందక, శక్తి సన్నగిల్లుతుంది. దీంతో చురుకుదనం తగ్గుతుంది. ఫలితం చేసే పనులపై ప్రభావం చూపుతుంది. అందుకని పోషకాహార చక్రం ఎవరికి వారు, వయసుల వారీగా ఆరోగ్యదాయకంగా మార్చుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి.



రోజూ ఉదయం నుంచి వంటింట్లో చెమటలు కక్కుతూ వంటకాలతో కుస్తీ పడుతుంటుంది అమ్మ. 'నీరసంగా ఉంటోంది.. ఏ పనీ చేయాలనిపించడం లేదు' అని అంటూనే లేని ఓపికను తెచ్చుకొని పనులు చేస్తూనే ఉంటుంది. 'కాళ్ల నొప్పులు.. కదలనివ్వడం లేదు' అంటూ కూర్చున్న చోటు నుంచి లేవలేకపోతుంటుంది బామ్మ. కాలేజీ నుంచి వస్తూనే 'బ్యాగ్ కూడా మోయలేను.. అలసటగా ఉంది' అంటూ సోఫాలో కూలబడిపోతుంది కూతురు. రోజూ మూడుపూటలా తింటూనే ఉన్నాం, అయినా ఎందుకిలా?! ఏ ఆరోగ్య సమస్యనో అని వైద్యులను కలిస్తే 'పోషకాహారం తీసుకోండి' అని చెబుతుంటారు. మన శరీరానికి ఏయే పోషకాలు అవసరం, సీజన్‌కి తగినట్టు మన ఆహారపు అలవాట్లను ఎలా మార్చుకోవాలి. సింపుల్‌గా హెల్తీ వంటకాలను ఎలా తయారు చేసుకోవచ్చు... ఈ వివరాలతో వరుస కథనాలు

1 బాల్యం నుంచి యవ్వనం (8-18 ఏళ్లు) వరకు

శరీరం వృద్ధి చెందడానికి, హార్మోన్ల సమతుల్యతకు, ఎముకల బలానికి ... పాల ఉత్పత్తులు, బాదం, ఆకుకూరలు, గుడ్లు, పప్పులు, మటన్, చికెన్, బచ్చలి, బ్రొకోలి, బీట్‌రూట్.. మొదలైన ఐరన్ నిచ్చే పదార్థాలు ఈ వయసుకు కీలకం.

బ్రేక్‌ఫాస్ట్: ఉప్మా/పొంగల్/ ఇడ్లీ.. + ఒక గుడ్డు + గ్లాస్ పాలు

మధ్యాహ్న భోజనం: బ్రౌన్ రైస్/ రోటీ (2)+ పప్పు, ఆకుకూర, బీన్స్, పెరుగు

సాయంత్రం స్నాక్స్: బాదం/జీడిపప్పు/ఇతర డ్రై ఫ్రూట్స్‌తో చేసిన స్నాక్స్ (చిన్న మోతాదులో)+ అరటి పండు

రాత్రి భోజనం: రోటీ (2) లేదా మినప పిండితో చేసిన అట్టు +ఏదైనా కూరగాయ + నిమ్మరసం కలిపిన వెజ్ సలాడ్



2 యువతులకు (19-30 ఏళ్లు)

రుతుక్రమం చురుకుగా ఉండటం, సంతానోత్పత్తి ప్లానింగ్‌కి సరైన సమయం. ఈ దశలో...

ఐరన్ – ఫోలేట్ సమృద్ధిగా లభించే ఆకుకూరలు, అరటి మొదలైనవి తినాలి. ఒమేగా-3 యాసిడ్స్ ఉండే ఫ్లాక్స్ సీడ్స్, చేపలు, వాల్‌నట్స్‌ను కూడా చేర్చుకోవాలి.. పీచుపదార్థాలు ఉండే గోధుమ, కూరగాయలు, జామ వంటి పండ్లు తినాలి. కాల్షియం కోసం పాలు, పెరుగు, టోఫు వంటివి తీసుకోవాలి. జింక్ సమృద్ధిగా లభించే చిక్కుళ్లు లాంటివి.. ఆహారంలో ఉండేలా చూసుకోవాలి.

మహిళల ఆరోగ్యం, ఫిట్‌నెస్‌కు సంబంధించి సమతులాహారం తీసుకోవడంలో జాగ్రత్తలు పెరిగాయి. కానీ, మన రొటీన్ ఫుడ్ మాత్రం అలాగే ఉంటోంది. హార్మోన్ల సమతుల్యతకు, శక్తికి తినే ఆహారం చాలా ముఖ్యమైనది. సాధారణంగా మహిళలు తీసుకునే ఆహారంలో ఉండాల్సినవి ఐరన్, కాల్షియం, విటమిన్లు, ప్రొటీన్లు.



శక్తికి ఇనుము... రక్తంలో ఐరన్ శాతం తగ్గితే బలహీనం అవుతారు. త్వరగా అలసిపోతారు. రక్తస్రావం అధికం అవుతుంది. తలనొప్పి, జుట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తుతాయి. బచ్చలి, పాలకూర, తోటకూర. గోంగూర వంటి ఆకుకూరలు, బీట్‌రూట్, చిక్కుళ్ళు, శెనగ, మటన్, పెసలు, నట్స్, ఎండు ఖర్జూరాలు, ఎండు ద్రాక్ష, తృణధాన్యాలు, గుడ్లు.. వంటివి శరీరంలో ఐరన్ శాతం పెరగడానికి సహాయపడతాయి. ఒక వ్యక్తి రోజువారీగా అవసరమైన ఐరన్ మోతాదు వారి వయసు, జెండర్‌పై ఆధారపడి ఉంటుంది. గర్భిణులు, బాలికలకు రోజూ 18 మిల్లీగ్రాముల ఐరన్ అవసరం. దీంతో పాటు విటమిన్ – సి ఉండే నారింజ, బత్తాయి వంటి సిట్రస్ పండ్లు, రసాలు తీసుకోవడం వల్ల ఒంట్లో ఇనుము శోషణ పెరుగుతుంది.

అ... అమ్మ ఆ... ఆహారం

3 గర్భధారణ సమయంలో...

పిండం అభివృద్ధికి, తల్లి శక్తికి తీసుకోవాల్సినవి... డాక్టర్ సలహాతో సప్లిమెంట్స్ + ఆకుకూరలు, నువ్వులు, దాల్చిన చెక్క, ప్రొటీన్ల కోసం గుడ్లు, పప్పులు, చికెన్, కాల్షియం – విటమిన్–ఇ కోసం పాల ఉత్పత్తులు, ఫైబర్‌కి పండ్లు, బ్రౌన్ రైస్, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్‌కి చేపలు, ఫ్లాక్స్ సీడ్స్.. వంటివి రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్: గోధుమ రవ్వ/ ఓట్స్ ఉప్మా+ అరటి పండు + గ్లాసుడు పాలు

లంచ్: బ్రౌన్ రైస్ /రోటీ (2) / మెంతికూర పప్పు/ పెసరపప్పు+ బెండకాయ కూర, పెరుగు + కారట్/కీరా సలాడ్

సాయంత్రం స్నాక్స్: బాదం/వాల్‌నట్ (4 –5) +అరటిపండు / సపోటా

డిన్నర్: రొట్టెలు (2) / మినప దోస, బీన్స్ / సొరకాయ కూర + గ్లాస్ మజ్జిగ.

పాల ఉత్పత్తులతో కాల్షియం... ఎముకల బలానికి,,, ప్రత్యేకంగా మెనోపాజ్ దశలో కాల్షియం అవసరం అధికం. అందుకు పాల ఉత్పత్తులు, బాదం, శనగలు, కాలీఫ్లవర్ .. వంటివి తినాలి. ● గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో ఫోలిక్ యాసిడ్ అవసరం ఎక్కువ. ఆకుకూరలు, మాంసం, దాల్చిన చెక్క.. వంటి వాటి నుంచి ఫోలిక్ యాసిడ్ లభిస్తుంది ● ఒమేగా–3 ఫ్యాటి యాసిడ్స్ మెదడు ఆరోగ్యానికి, హార్మోన్ల సమతుల్యతకు ఉపయోగ పడతాయి. ఫ్లాక్స్ సీడ్స్, వాల్ నట్స్, చేపల నుంచి ఈ ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి ● శరీర బలానికి, కండరాల పెంపుకు ప్రొటీన్లు చాలా అవసరం. మినపప్పు, చికెన్, గుడ్లు, నట్స్... నుంచి ప్రొటీన్లు లభిస్తాయి ● జీర్ణ వ్యవస్థ సజావుగా పనిచేయడానికి ఫైబర్ చాలా అవసరం. గోధుమ, మొక్కజొన్న, పండ్లు, కూరగాయల నుంచి లభిస్తుంది.





- డా.బి. జానకి
పోషకాహార నిపుణులు



4 పాలిచ్చే తల్లులు

తగినంత శక్తిని తిరిగి పొందడానికి, పాల వృద్ధికి తీసుకోవాల్సినవి.. ఆకుకూరలు, బ్రోకలీ, కాలీఫ్లవర్, పండ్లు, లేత మాంసం, గుడ్లు, పాల ఉత్పత్తులు, బీన్స్ తల్లులకు ప్రొటీన్ అందిస్తాయి. పాల ఉత్పత్తులు, నువ్వులు, ఆహారం జీర్ణం అవడానికి పల్చని మజ్జిగ మొదలైనవి తీసుకోవాలి.

బ్రేక్‌ఫాస్ట్: పెసరట్లు, అల్లం పచ్చడి+గ్లాసుడు పాలు/రాగి జావ

లంచ్: బ్రౌన్ రైస్+ మటన్/ చికెన్‌కర్రీ, మెంతికూర పప్పు, పెరుగు, గోంగూర పచ్చడి. **సాయంత్రం స్నాక్స్:** జీరా రసం + బాదం/మెంతి లడ్డు, ఏదైనా ఒక పండు. **డిన్నర్:** రోటీ (2)/మినప రొట్టె, పల్లీలు, బచ్చలి కూర రాత్రి పడుకునే ముందు (ఒంటిగంట లోపల) గ్లాస్ నీళ్ల లేదా చిటికెడు పసుపు కలిపిన గోరువెచ్చని పాలు. బాగా ఆకలిగా అనిపిస్తే అర టేబుల్ స్పూన్ గుమ్మడికాయ గింజలు.

5 మెనోపాజ్ దశ

45 ఏళ్లు పైబడిన మహిళలు ప్లాన్ చేసుకోదగిన పోషకాహారంలో హార్మోన్ల సమతుల్యత, ఎముకల బలం, కొలెస్ట్రాల్ నియంత్రణ పై దృష్టి పెట్టాలి. కాల్షియం – విటమిన్–ఇ కోసం పాల ఉత్పత్తులు, సోయా, టోఫు వంటివి తీసుకోవాలి. చేపలు, ఫ్లాక్స్ సీడ్స్, పీచుపదార్థాలు ఉండే కూరగాయలు, పండ్లు ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. యాంటీ ఆక్సిడెంట్లు ఉండే బెర్రీస్, నాటు, తాటి బెల్లం, గ్రీన్ టీలను చేర్చుకొని చక్కెర, ఉప్పు తక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి... **బ్రేక్‌ఫాస్ట్: (ఉదయం 8:00 - 9:00):** ఓట్స్ + పాలు + కొద్దిగా వాల్‌నట్ లేదా బాదం (లేదా) రాగి దోస + పెసరపప్పు చట్నీ, ఒక అరటి పండు + గ్లాస్ నీరు. **మధ్యాహ్న భోజనం (లంచ్ - 1:00):** బ్రౌన్ రైస్ లేదా గోధుమ/జొన్న/సజ్జ రొట్టెలు, ఆకుకూరల పప్పు (గోంగూర, తోటకూర వంటివి), దుంపలు కాకుండా దొండకాయ/బీన్స్/బెండకాయ, సలాడ్ (కీరా, గాజర్), పెరుగు. **సాయంత్రం స్నాక్స్ (5:30 - 6:00):** గ్రీన్ టీ లేదా తులసి టీ (షుగర్ లేకుండా) నట్స్ (బాదం, నువ్వులు లేదా ఫ్లాక్స్‌సీడ్స్) (లేదా) ఆపిల్ / పియర్ / సపోటా **రాత్రి భోజనం (డిన్నర్ - 7:30 - 8:00):** గోధుమ రొట్టె (1–2). వెజిటబుల్ సూప్ లేదా తేలికగా జీర్ణం అయ్యే కూర (బెండకాయ, సొరకాయ వంటివి), మజ్జిగ (ఉప్పు తక్కువతో) తీసుకోవాలి.

సమతుల్యత అవసరం

ఓవర్ ఈటింగ్/ తక్కువ తినడం రెండూ సమస్యలు తెచ్చిపెట్టేవే. వ్యక్తి శరీర బరువు, శ్రమను బట్టి డైట్ ప్లాన్ చేసుకోవడం ఈ రోజుల్లో తప్పనిసరి. ప్రతి వ్యక్తికి వారి శరీర బరువు, జీవనశైలి, ఆరోగ్య పరిస్థితుల ఆధారంగా డైట్ చార్ట్ ప్లాన్ చేసుకోవాలి. **ఉదాహరణ:** 50 ఏళ్ల మహిళ డైట్ చార్ట్. ● సమతుల్యత, ఎముకల ఆరోగ్యం, శక్తి ఉండేటట్లు డైట్ ప్లాన్ చేయాలి. **ప్రత్యేక సూచనలు:** ● రోజూ కనీసం 7,000 – 8,000 అడుగులు నడవాలి / యోగా / లైట్ స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయాలి. ఉప్పు, స్వీట్స్ తక్కువగా వాడాలి ● మెనోపాజ్ దశ కాబట్టి కాల్షియం, విటమిన్–ఇ విషయంలోప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. పాల ఉత్పత్తులు తప్పనిసరి. 15 నిమిషాలు శరీరానికి సూర్యరశ్మి నేరుగా తాకేలా చూసుకోవాలి.

పిల్లలకు చెప్పాల్సిన మాయాబజార్ పాఠాలు



'మీరు ఉద్దండ పండితులేగాని ఉండాల్సిన బుద్ధి మాత్రం లేదయ్యా' అంటాడు శకుని.
ర్యాంకులు వేరు... కామన్‌సెన్స్ వేరు...
ఈ సంగతి పిల్లలకు ఎవరు చెప్పాలి?
'ముక్కోపానికి విరుగుడు ముఖస్తుతి ఉండనే ఉంది' అంటాడు ఇదే శకుని.
ఈ చిట్కా చెప్పడానికి పెద్దలకు తీరిక ఎక్కడిది?
అస్మదీయులు ఎవరో తస్మదీయులు ఎవరో తెలుసుకోకపోతే పిల్లల అడుగులు పడేదెలా?
హాయ్ హాయ్ నాయకా.. హోయ్ హోయ్ నాయకా...
నాయకత్వ లక్షణాలు ఎవరికి ఉంటాయి?
తెలుగువారికి మాత్రమే ఉన్న వ్యక్తిత్వ వికాస సర్వస్వం 'మాయాబజార్' సినిమా.
ఈ సెలవుల్లో పెద్దలు పిల్లలతో ఈ సినిమా చూడాలి. వివరించాలి.



'మాయాబజార్' 1957లో విడుదలైన గొప్ప తెలుగు చిత్రం. భారతంలోని పాత్రలకు కొద్దిపాటి కల్పన జత చేసి మలచిన ఈ సినిమా ఎందుకు ఇంతకాలం ఆదరణ పొందుతూ ఉందంటే అది ఎప్పుడూ ఒకేలా ఉండే మానవ స్వభావాలను చిత్రించింది కనుక. నేడు ఎదురుపడే మనుషులు ఎలా ఉంటారో ఈ సినిమాలో పాత్రలు అలా ఉంటాయి. అందుకే వాటితో తమను తాము ఐడెంటిఫై చేసుకున్న ప్రేక్షకులు ఎన్నో పాఠాలు నేర్చుకుంటారు. అర్థం చేసుకుంటారు. పిల్లలకు ఈ సినిమా గొప్ప వినోదంగా ప్రారంభమవుతుంది. ఐదేళ్ల వయసు పిల్లల నుంచి ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు. చూసేకొద్దీ ఎదిగే కొద్దీ వారికి సినిమా కొత్తగా అర్థమై మరింతగా నచ్చుతుంది. ఈ సినిమాకు ఫ్యాన్స్ అయిపోతారు. అలా తరతరాలుగా ఫ్యాన్స్ అయ్యేలా చేసుకుందీ సినిమా. గతంలో ప్రతి వేసవిలో ఈ సినిమా రీరిలీజ్ అయ్యేది. ఇప్పుడు ఓటీటీల్లో... యూట్యూబ్‌లో కలర్‌లో ఉంది. పిల్లలతో ఒకటికి రెండుసార్లు చూసి వారికి చెప్పాల్సిన పాఠాలు చాలానే ఉంటాయి.

1. బాల అభిమన్యు తన విలువిద్య గురించి ఇలా అంటాడు: అత్తయ్యా... నువ్వు జడవకుండా నుంచో... నీ ముక్కుకు తగలకుండా నత్తును కొడతాను.

పిల్లలకు చెప్పాలి: నత్తు అంటే ముక్కుకు పెట్టుకునే ఆభరణం. విలువిద్య నేర్చుకుని ఎవరైనా సరే పండునో కాయనో కొట్టగలరు... కాని ముక్కుకు తగలకుండా నత్తును కొడతానంటున్నాడంటే విలువిద్య చాలా గొప్పగా నేర్చుకున్నాడన్న మాట. మనం చదివినా, ఆటల్లో ప్రవేశించినా, కళల్లో ఉన్నా ఆ స్థాయి పరిణితి సాధించాలి. అభిమన్యుడిని ఆదర్శంగా తీసుకోవాలి.

2. శ్రీకృష్ణుడు 'సత్యపీఠం' తీసుకువస్తాడు. అలాగే 'ప్రియదర్శిని' కూడా చూపిస్తాడు.

పిల్లలకు చెప్పాలి 'సత్యపీఠం' ఆనాటి లై డిటెక్టర్. మన పూర్వీకులు శాస్త్ర పరంగా గొప్ప ప్రయోగాలు చేశారు. ఊహలు చేశారు. శాస్త్రజ్ఞుల ఊహలో లేని కాలంలో 'సత్యపీఠం' ఊహ చేయడం మనవారి గొప్పతనం. అలాగే వీడియో కాల్ చేసుకునేలా ల్యాప్‌టాప్ లాంటి 'ప్రియదర్శిని'ని చూపించారు. సైన్స్ దృష్టి కోణం నుంచి పురాణాలు చూస్తే చాలా ఇంటెరెస్టింగ్ విషయాలు తెలుస్తాయని చెప్పాలి.

3. శకుని పాచికలు వేస్తూ అంటాడు: ఈ పాచికలతో ఎవరినైనా సర్వనాశనం చేయగలను.


పిల్లలకు చెప్పాలి: జూదం వ్యసనం. అందులో మోసం ఉంటుంది. నష్టం ఉంటుంది. ఒక్కసారి వ్యసనాల్లో దిగితే తిరిగి రావడం కష్టం. నేటి రోజుల్లో ఆన్‌లైన్ గేమింగ్ కూడా అలాంటి వ్యసనమే. బెట్టింగ్ యాప్‌లు కూడా వ్యసనమే. ఆల్కహాల్, డ్రగ్స్ కూడా వ్యసనాలే. వ్యసనాల వల్ల పాండవులు రాజ్యాలను కోల్పోయారు. అందువల్ల ఎప్పుడూ వ్యసనాల జోలికి పోకూడదు.

4. శర్మ, శాస్త్రి వచ్చి లక్ష్మణ కుమారుణ్ణి పొగుడుతూ 'పురోగమించుట వారికి తెలుసు... తిరోగమించుట తమకు తెలుసు' అంటారు.

పిల్లలకు చెప్పాలి: గొప్పలు చెప్పుకోవడం, పొగడ్తలకు పడిపోవడం అల్పుల లక్షణం అని, లక్ష్మణ కుమారుడు అలాంటి వాడని చెప్పాలి. మనకు ఎంత ప్రతిభ ఉన్నా గొప్పలు చెప్పుకోకూడదని నేర్పాలి. లేని ప్రతిభ ఉన్నట్టుగా కల్పించి చెప్పి అభాసుపాలు కాకూడదని చెప్పాలి. మన బలహీనతను వాడుకుంటూ కొందరు చుట్టూ చేరి మోసం చేసి పబ్బం గడుపుతారనీ అలాంటి వారిని గుర్తించి దూరం ఉండాలి చెప్పాలి.

5. రాజ్యం పోయాక సుభద్ర వస్తే బలరాముని ఇంట్లో పరాభవం

పిల్లలకు చెప్పాలి: కొందరు మనుషులు అభిమానాన్ని బట్టి గాక స్థితిని బట్టి గౌరవిస్తారని, మనం కష్టంలో ఉంటే వారు అసలు రూపు చూపిస్తారని అలాంటి వారిని చూసి జాలి పడాలి తప్ప బాధ పడకూడదని నేర్పాలి. డబ్బుకు అతీతమైన విద్యాబుద్ధులు, వ్యక్తిత్వం శాశ్వతమని, వాటికే లోకంలో విలువ, గౌరవం అని చెప్పాలి.



6. ఘటోత్కచుడి ప్రవేశం

పిల్లలకు చెప్పాలి: మన దేశంలో అడవుల్లో జీవించేవారు ఉంటారని వారిని గిరిజనులు, ఆదివాసీలు అంటారనీ వారి కట్టు, బొట్టు, భాష, యాస, ఆచారాలు వేరని... మనం నాగరికులం అయినంత మాత్రాన వారిని చిన్నచూపు చూడకూడదని. వారెంతో మంచి వారని, అడవులు వారి ఆధారం అని వాటిని నరికి లాక్కుని వారికి హాని కలిగించడం తప్పు అని నేర్పాలి. 'అస్మదీయులు' అంటే ఫ్రెండ్స్ అనీ, ఆదివాసీలకు మనం అస్మదీయులుగా ఉండాలని చెప్పాలి.

7. దుష్ట చతుష్టయం

పిల్లలకు చెప్పాలి: దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని, కర్ణుడు... వీరు నలుగురిని దుష్ట చతుష్టయం అంటారని చతుష్టయం అంటే నాలుగు అని చెప్పాలి. చెడు ఆలోచనలు చేసేవారితో స్నేహం చేస్తే మనం కూడా చెడ్డవాళ్లం అవుతామని చెడ్డపనులు చేయడం వల్ల ప్రమాదంలో పడతామని హెచ్చరించాలి.

8. గింబళి, గిల్పం కావాలని డిమాండ్

పిల్లలకు చెప్పాలి: స్నేహితులైనా, బంధువులైనా న్యాయమైన సాయం, కోరిక కోరితే నెరవేర్చాలని, అదే మన మంచితనం సాకుగా తీసుకుని గొంతెమ్మ కోరికలు కోరితే వారికి బుద్ధి చెప్పాలని నేర్పాలి. 'కంబళి', 'తల్పం' కాదని 'గింబళి', 'గిల్పం' కోరిన శర్మ, శాస్త్రులకు చిన్నమయ్య బుద్ధి చెప్పే దృశ్యాలు పిల్లలకు ఎంతగానో నవ్వు తెప్పిస్తాయి.

9. శాకంబరీదేవి ప్రసాదం- వివాహ భోజనంబు

పిల్లలకు చెప్పాలి: తెలుగువారి భోజనానికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయని ప్రతి ప్రాంతానికీ సమూహాలకు వారివైన ఆహార అలవాట్లు ఉంటాయని, వాటిని గౌరవించాలని మన ఆహారపు అలవాట్లను పాటించాలని నేర్పించాలి. గోంగూరను శాకంబరీ దేవి ప్రసాదం అంటారని తెలుగువారికి గోంగూర ఇష్టమని చెప్పాలి. భక్ష్యాలు, చిత్రాన్నాలు, పానీయాలు, కూరగాయలు అంటే ఏమిటో వాటి తేడాలేమిటో చెప్తే సరదా పడతారు.


10. చినమాయను పెనుమాయ

పిల్లలకు చెప్పాలి: ఏ పనైనా నిజాయితీగా చేస్తే ఫలితం ఉంటుందని.. మాయతో కపటంతో శశిరేఖను లక్ష్మణ కుమారుడికి ఇచ్చి పెళ్లి చేయాలని కౌరవులు భావిస్తే శ్రీకృష్ణుడు, ఘటోత్కచుడు పెనుమాయతో ఆ పెళ్లిని పెటాకులు చేశారని... తగిన శాస్తి జరిగిందని... చెడ్డవాళ్లు ఎప్పటికీ ఓడిపోతారని, మంచితనంతో ఉంటేనే గెలుస్తామని బోధించాలి.

కె.

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

శ్రమైక జీవనం



కాల్చే ఆకలి, కూల్చే వేదన, దారిద్ర్యాలు, దౌర్జన్యాలు... ఒంటి చేత్తో తోసిరాజని....

పనిలో తమను తాము నిరూపించుకున్నారు మహిళా కార్మికులు.

కార్మికలోకపు కల్యాణానికి, శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణగా నవీన శక్తిలా ముందుకు వచ్చారు మహిళా కార్మికులు.

శ్రమైక జీవన సౌందర్యానికి ప్రతిబింబం అయ్యారు.

'ఈ రంగంలో మహిళలు పనిచేయలేరు' అనుకునే రంగాలలోకి వచ్చి అపోహలను బద్దలు కొట్టారు.

'పురుషులకు ఎక్కడా తీసిపోము' అని నిరూపించారు. నిరూపిస్తూనే ఉన్నారు. అయితే... ఇది నాణేనికి ఒక కోణం మాత్రమే. మరో కోణంలో చూస్తే మహిళా ఉద్యోగులు, కార్మికుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

కోల్‌కత్తాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య మన దేశంలో ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులలో మహిళా ఉద్యోగుల భద్రతకు సంబంధించిన చర్చను ముందుకు తెచ్చింది. వివిధ సర్వేల ప్రకారం మూడింట ఒకవంతు మంది మహిళలు పని ప్రాంతంలో ఏదో ఒక రకమైన శారీరక హింసను ఎదుర్కొంటున్నారు.

మహిళా సిబ్బందికి వారి పని ప్రాంతంలో ప్రమాదాలు పెరిగాయి. చాలా ప్రాంతాల్లో సీసీటీవీ నిఘా లేదు. సరైన నిఘా, రిపోర్టింగ్ యంత్రాంగం లేకపోవడంతో అనుచిత ప్రవర్తన, వేధింపులు పెరిగాయి. ప్రాథమిక భద్రతా చర్యల గురించి చాలా సంస్థలలో మహిళా ఉద్యోగులకు అవగాహన కలిగించడం లేదు.

గార్మెంట్ ఫ్యాక్టరీలలో ఎక్కువమంది కార్మికులు మహిళలే. అయితే పురుషులతో పోల్చితే వారికి తక్కువ వేతనం ఇస్తున్నారు. వేతన అసమానతలతో పాటు పనిప్రాంతంలో ప్రమాదాలు, పురుషాధిపత్య వేధింపులు ఎదుర్కొంటున్నారు. పరిశ్రమలలో మహిళాకార్మికులకు మౌలిక సదుపాయాల కొరత ఉంది.

'బిజినెస్ అండ్ హ్యూమన్ రైట్స్' రిపోర్ట్ మన దేశంలో గార్మెంట్ ఫ్యాక్టరీలలో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చింది. నిజానికి 'ఇది కేవలం గార్మెంట్ పరిశ్రమలకు సంబంధించిన రిపోర్ట్ మాత్రమే' అనుకోనక్కర్లేదు. చిన్నా, పెద్ద తేడాలతో ఎన్నో పరిశ్రమలలో వేరు వేరు రూపాల్లో ఇదే పరిస్థితి ఉంది.

కోవిడ్ మహమ్మారి ఉమెన్ హెల్త్ వర్కర్‌లకు ప్రమాదాలు తెచ్చింది. విధి నిర్వహణలో చనిపోయిన వారు కూడా ఉన్నారు. అయినా వెనక్కి తగ్గలేదు.

నిరాశ పడే పరిస్థితులు రావచ్చు, భద్రతాపరమైన సమస్యలు ఉండవచ్చు....ఒకటి, రెండు అని కాదు....సవాలక్ష సమస్యలు ఎదురైనా మహిళా శ్రామిక శక్తి వెనక్కి తగ్గడం లేదు.

ఎందుకంటే వారు...

చరిత్ర వింటూ వచ్చారు. మరో చరిత్ర నిర్మించాలనుకుంటున్నారు.